
# దాంపత్యం మేడీజీడాట్ కామ్

వంశీకృష్ణ



"జీవితం చాలా నిస్సారంగా తయారయింది. ఒక్క అనుభూతి కూడా హృదయాన్ని కదిలించడం లేదు. అసలు మాకో హృదయం వుందన్న విషయమే గుర్తుకు రావడంలేదు. దానికి స్పందనలు అసలే లేవు"

కథ

"**ఊc!** ఇప్పుడు చెప్పండి! మీ సమస్యేమిటో" కొంచెంగా ముందుకు వంగి క్యూరియస్‌గా అడిగాడు ధన్వంతరీ ఆచార్య.

అనూష, సందీప్, ఒకరి మొహం వంక ఒకరు చూసుకున్నారు. నువ్వు చెప్పు అంటే నువ్వు చెప్పు అని సజెషన్ యిచ్చుకున్నారు. కానీ నిముషం సేపు ఎవరూ మాట్లాడలేదు. అనూషయితే నేలకేసి చూస్తూ టెన్షన్‌గా నేలమీద రాయసాగింది. సందీప్ కూడా అంతే! అసహనంగాను, టెన్షన్‌గానూ, కుర్చీలో యిబ్బందిగా కదలసాగేడు. వాళ్లిద్దరి మొహాలమీద అప్పటివరకూ లేని చెమట దట్టంగా కమ్ముకుంది.

"మీరు త్వరగా చెప్పాలి! బయట చాలామంది కస్టమర్లు వెయిట్ చేస్తున్నారు" ఈసారి ధన్వంతరి స్వరంలో మార్దవం, క్యూరియస్‌నెస్ స్థానంలో అసహనం ప్రస్ఫుటమయిది.

"నువ్వు చెప్పు" అన్నాడు సందీప్.

"కాదు. నువ్వే చెప్పు" అన్నది అనూష.

హైదరాబాద్‌లోని అతిపెద్ద పోష్ లొకాలిటీలో వున్న సోఫెస్టికేటెడ్ కార్యాలయం అది. ఆ కార్యాలయాన్ని అన్నీ తానై నడిపిస్తున్న ధన్వంతరీ ఆచార్య అంటే నగరంలోనే కాదు ఆంధ్ర దేశమంతటా గొప్పపేరు. అమెరికన్ బేస్డ్ ఎఫ్.ఎండ్.హెచ్ ఫ్యామిలీ కన్సల్టెంట్లకి ఇండియన్ ఫ్రాంఛైజ్ అది. ఎఫ్.ఎండ్ హెచ్ ఫ్యామిలీ కన్సల్టెంట్లకి ప్రపంచంలోని ఇరవైమూడు దేశాలలో ఫ్రాంఛైజీలు వున్నాయి. న్యూక్లియస్ ఫ్యామిలీలలో ఏర్పడే అతి చిన్న సమస్య నుండి అతి పెద్ద సమస్య వరకు అత్యంత లాఘవంగా పరిష్కరించడంలో దానిది పెద్ద పేరు.

భార్యాభర్తల దాంపత్య జీవితాన్ని కూడా ఒక కంపెనీ మనుగడతో పోల్చడం దాని ప్రత్యేకత. కంపెనీ అభివృద్ధికి లాభాలు ఎలా గీటురాయి అవుతాయో దాంపత్య జీవితం ఫలవంతం కావడానికి వాళ్లిద్దరూ పొందే సుఖసంతోషాలే గీటురాళ్లు అంటుంది ఎఫ్.ఎండ్.హెచ్ సంస్థ.

హైదరాబాద్‌లో ప్రారంభించిన అతి కొద్ది కాలంలోనే బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. రాష్ట్రం నలుమూలల నుండీ సమస్యలతో వస్తున్న జనం ఆ కార్యాలయాన్ని వెల్లువలా ముంచెత్తారు.

"లుక్! యంగ్‌మ్యాన్! మూడు నెలలక్రితం ఎపాయింట్‌మెంట్ తీసుకుని మీరు ఎఫ్.ఎండ్.హెచ్‌కి వచ్చారంటేనే ఏదో సమస్యతో బాధపడుతున్నారని అర్థం. అదేమిటో చెప్పకపోతే మేం ఎలాసాల్వ్ చేస్తాం చెప్పండి? బీ కూల్! యిదేదో కార్పొరేట్ హాస్పిటల్ అనీ మీరు రోగగ్రస్తులనీ ఫీల్ అవకండి. ఫీల్ ఎట్ యువర్ హోమ్! నెమ్మదిగా చెప్పండి!"స్వరాన్ని మార్దవంగా పలికిస్తూ అన్నాడు ధన్వంతరీ ఆచార్య!

అతనలా మాట్లాడేసరికి, లాలనగా బుజ్జగించేసరికి అనూష, సందీప్ యిద్దరిలో కాస్త బెరుకు తగ్గింది. అప్పటిదాకా అనుభవిస్తున్న టెన్షన్ అంతా ఎవరో చేత్తో తీసివేసినట్లుగా తొలగిపోయింది.

"మేమిద్దరం ప్రేమించి పెళ్లి చేసుకున్నాం సర్! మా పెళ్లయి నాలుగేళ్లు అవుతోంది. మొదటి రెండు సంవత్సరాలు టైము ఎలా గడిచిందో తెలియకుండా గడిచింది. కానీ ఈ రెండేళ్ల నుండి జీవితం నరకప్రాయమయింది" అన్నాడు సందీప్ భావరహితంగా ధన్వంతరి కళ్లలోకి చూస్తూ!

"నిజంసర్! జీవితం చాలా నిస్సారంగా తయారయింది. ఒక్క అనుభూతి కూడా హృదయాన్ని కదిలించడం లేదు. అసలు మాకో హృదయం వుందన్న విషయమే గుర్తుకు రావడంలేదు. దానికి స్పందనలు అసలే లేవు" అన్నది అనూష మరికాస్త ధైర్యం తెచ్చుకుని.

"ఒకే! మైడియర్ యంగ్  కపుల్!" అని ఒక్క నిముషం ఆగాడు ధన్వంతరి.

అతడేం చెపుతాడోఅని ఆసక్తిగా, టెన్షన్‌గా అతడివంకే చూడసాగేరు ఇద్దరూ!

"మీ ఇద్దరూ మాట్లాడుతున్నపుడు మిమ్మల్ని చాలా గమనించేను నేను. మీ బాడీ లాంగ్వేజ్ ఆధారంగా నా ఎనాలిసిస్ ఏంటంటే... మీ యిద్దరికీ ఒకరంటే ఒకరికి ఇంకా పూర్తిగా ప్రేమ చచ్చిపోలేదు. కనుక డయాగ్నసిస్ చెయ్యడం తేలికే! మీ జీవన విధానంలో ఏప మార్పులు రావాలన్నది డీటెయిల్స్ రిపోర్టు వచ్చాక ఎసెస్ చేస్తాం! దానికి ఫీజు భారీగా వుంటుంది. మీరు భరించగలరా?" వాళ్ల కళ్లలోకి సూటిగా చూస్తూ కన్విన్సింగ్‌గా చెప్పాడు ధన్వంతరీ.

"ఎంతవుతుంది" ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"జస్ట్ ఫిఫ్టీ థౌజండ్స్"

"ఒ. కే. సర్! నోప్రాబ్లం. ఉయ్ విల్ షేర్ యిట్!మా జీవితం కుదుట పడితే అంతే చాలు" అనూష, సందీప్ యిద్దరూ ఒకేసారి అన్నారు.

"దెన్. ఒకే! ఇలా రండి!" అంటూ ఇద్దర్నీ మరో రూములోకి తీసు కెళ్లారు.  ఆ గదిలోకి  వెళ్తూనే అప్రతిభులయిపోయినారు, అనూష సందీప్ ఇద్దరూ!

చాలా విశాలమయినగది అది. బయటనుండి చూస్తే అంత విశా లంగా  వున్నట్టు అన్పించదు. గది ఈ చివర నుండి ఆ చివర వరకు సన్నటి పొడవాటి టేబుల్‌పైన ఏడెనిమిది కంప్యూటర్లు వాటి ముందు ఇరవై నుండి ముప్పై ఏళ్లలోపు అమ్మాయిలు నలుగురు కూర్చుని పని చేస్తున్నారు. నిరంతరాయంగా వస్తున్న ప్రింటవుట్లను తీసి మరో పక్క గదిలోకి పంపిస్తున్నారు మరో యిద్దరు.

అనూష  సందీప్ యిద్దరూ తలుపు తెర్చుకుని లోపలకు వెళ్లారు. ముందు గదిలోనుండి వచ్చిన ప్రింటవుట్లను ఎనలైజ్ చేస్తూ ఫైండిం గ్స్‌తో కంప్యూటర్లను అప్‌డేట్ చేస్తున్నారు మరికొందరు.

ఆ గదిలోనుండి మరో గదిలోకి తీసుకెళ్లాడు అనూషను, సందీప్‌ను ధన్వంతరీ ఆచార్య. అదో పెద్ద లైబ్రరీ. ర్యాకుల నిండా మహా మును ల్లాగా మౌనంగా నిలబడివున్నాయి పుస్తకాలు. ఉత్సుకతకొద్దీ ఒక పుస్త కాన్ని తీసిచూశాడు సందీప్. అది సోమర్సెట్ మామ్ రాసిన "ఆఫ్ హ్యూమన్ బాండెజి". ఆ పుస్తకాల వంక విస్ఫారిత నేత్రాలతో అనూష చూస్తూ వుండగానే "రండి" అంటూ ఫస్ట్ రూంలోకే తీసుకెళ్లాడు.

వాళ్లు వెళ్లేసరికి ముగ్గురికోసం మూడు గ్లాసుల్లో "కొబ్బరినీళ్లు" టేబుల్‌పైన సెర్వ్ చేసి వున్నాయి.

"ప్లీజ్ హేవిట్" అంటూ "మేం కూల్‌డ్రింక్స్‌ను పూర్తిగా నిషేధించాం! మా  కస్టమర్ల ఆరోగ్యం మాకు ఎంతో ముఖ్యం. హెల్దీ మైండ్ యిన్ హెల్దీ బాడీ కదా!" నవ్వాడు ధన్వంతరి.

అనూష సందీప్ మొహమాటంతో నవ్వీ నవ్వనట్టుగా నవ్వారు.

"సో! చూశారుగా మా ఎక్విప్‌మెంట్ అంతా! మేం ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా ఎనలైజ్ చేశాకే ఒక కంక్లూజన్‌కి వస్తాం. అందుకే మా ఎఫ్. ఎండ్. హెచ్‌కి అంత పేరు" అని తీసుకోండి అంటూ కొబ్బరి నీళ్లు ముందుకు జరిపాడు.

ఇద్దరూ  కొబ్బరినీళ్లు తీసుకున్నారు. తర్వాత యిలా రండి అంటూ ఇద్దర్నీ మరో గదిలోకి తీసుకెళ్లి... ఇద్దరు చేతులకీ ఫ్రెండ్‌షిప్ బాండ్ లాంటి ఒక బాండ్‌ను కట్టేశాడు.


"ఏమిటిది!" అనూష సందీప్ యిద్దరూ ఒకేసారి అడిగారు.


"దీన్ని ఎట్టి పరిస్థితులలోనూ చెయ్యినుండి తీసెయ్యకండి. ఈ బాండ్‌లో అత్యంత శక్తివంతమయిన, అత్యంత సూక్ష్మమయిన రికార్డర్ ఒకటి వుంది. ఇది ఈ క్షణం నుండి మీ ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో పాటు ప్రతి మాటనీ రికార్డ్ చేస్తుంది. ఇది యిచ్చే ఇన్ఫర్‌మేషన్ ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకుంటాం. మరో ముఖ్య విషయం... మీరు యింటికెళ్లాక ఒక  "హాఫ్ యాన్ అవర్‌కి మా మనిషి ఒకడు మీ యింట్లో అత్యంత అవసరమయిన చోట్ల రెండు కెమెరాలు ఫిక్స్ చేస్తా డు. అవి అవసరం అయినప్పుడు మాత్రమే పనిచేస్తాయి. వాటి ఆధా రంగా మీ బాడీ లాంగ్వేజ్‌ను ఎనలైజ్ చేస్తాం!"

ధన్వంతరీ మాటలకు యిద్దరూ అప్రతిభులయిపోయారు.

"లుక్ యంగ్ కపుల్! కౌంటర్లో యిప్పుడో పాతికవేలు డిపాజిట్ చెయ్యండి.  వారం  రోజుల తర్వాత మళ్లీ రండి. డోంట్ వర్రీ. మీ సంసారం పూర్తిగా బాగుపడుతుంది. అన్నట్టు మీకు పి.సి. వుందా? వుండే వుంటుంది లెండి. మీకు ఎప్పుడు ఏ సందేహం వచ్చినా మా "www. దాంపత్యం. మేడీజీ. కాకు లాగిన్ అవ్వండి. మీకు చక్కటి

"మీ ఇద్దరూ మాట్లాడుతున్నపుడు మిమ్మల్ని చాలా గమనించేను నేను. మీ బాడీ లాంగ్వేజ్ ఆధారంగా నా ఎనాలిసిస్ ఏంటంటే... మీ యిద్దరికీ ఒకరంటే ఒకరికి ఇంకా పూర్తిగా ప్రేమ చచ్చిపోలేదు. కనుక డయాగ్నసిస్ చెయ్యడం తేలికే! మీ జీవన విధానంలో ఏప మార్పులు రావాలన్నది డీటెయిల్స్ రిపోర్టు వచ్చాక ఎసెస్ చేస్తాం! దానికి ఫీజు భారీగా వుంటుంది. మీరు భరించగలరా?"






సలహాలు, సంప్రదింపులు దొరుకుతాయి. విష్ యూ ఆల్ ది బెస్ట్" అంటూ కుడిచెయ్యిని ముందుకు చాపాడు ధన్వంతరీ ఆచార్య.

** ** **

ఇంటికి తిరిగి వెళుతూ సందీప్, అనూష ఒక్కమాట కూడా మాట్లాడుకోలేదు. ఇద్దరి మనసుల్లోనూ ఒకటే ఆలోచన. తమ సంసారం బాగు పడుతుందా? ఈ ఎఫ్.ఎండ్.హెచ్‌కి వచ్చి ఏమయినా తప్పు చేశామా?

అప్రయత్నంగా తన కుడి చేతివంక చూసుకుంది అనూష. ఎర్రటి రిబ్బన్‌తో కట్టిన ఫ్రెండ్‌షిప్ బాండ్. ఇది తన మనసులోని ఆలోచనలను కూడా రికార్డు చేస్తుందా?

కారు ఫ్లై ఓవర్ మీద నుండి పోతూవుంటే "నీకివాళ సెలవే కదా! నేను ఆఫీసుకు పోయి మధ్యాహ్నం రెండుగంటలకల్లా వస్తాను. నిన్ను యింటిదగ్గర డ్రాప్ చెయ్యనా?" అని అడిగాడు సందీప్.

"ఊఁ"! అంది మాట్లాడకుండా అనూష.

మరో పదినిమిషాల్లో యింటిముందు అనూషను డ్రాప్ చేసి సందీప్ వెళ్లిపోయాడు.

తలుపు తీసి యింట్లోకి వెళుతూనే సోఫాలో కూలబడిపోయింది అనూష. అలసటగా కళ్లు మూసుకుంది.

తనంటే సందీప్‌కి ఎంత యిష్టం?!

తన కోసం ఎంతలా వెంటపడ్డాడు? ఎంతలా వేధించాడు. తాను కాదంటే ఆత్మహత్య చేసుకోపోయాడు. చివరకు పెద్దవాళ్లను కన్విన్స్ చెయ్యలేక ఇద్దరూ ఒక నిర్ణయం తీసుకుని పెళ్లి చేసుకుని వచ్చేశారు. ఇరువైపులా, అందరికీ దూరమే! వచ్చి పలకరించేవాళ్లు లేరు. దుఃఖాన్ని, సంతోషాన్ని పంచుకోవడానికి సందీప్ తప్పితే మరో మనిషెవరూ లేరు.

రోజులు గడుస్తున్నకొద్దీ, ప్రేమ తాలూకు మంచుతెరలు కరిగిపోతున్నకొద్దీ సందీప్‌లోని బలహీనతలు బలంగా కన్పించసాగినయి. చివరకు సందీప్‌మీది అసంతృప్తిని పంచుకోవడానికి కూడా సందీప్ తప్పితే మరో మనిషి లేరు.

ఈ లోగా చిన్నూ పుట్టాడు. వాడు రెండు రోజులయినా ఈ ప్రపంచంలో నిలవకుండానే కళ్లు మూసాడు. అదో పెద్ద షాకు తనకి. ఆ దుఃఖం అనుభవేక వైద్యం అయితేకానీ అర్థం చేసుకోలేనిది.

పెళ్లయిన సంవత్సరంన్నరకే యిద్దరికీ ఉద్యోగాల్లో చెరో ప్రమోషన్ వచ్చింది. దాంతో యిద్దరికీ బాధ్యతలు పెరిగాయి. ఉద్యోగంలో గడిపే సమయమే ఎక్కువయింది. ఉదయం ఎనిమిదింటికి బయట పడితే రాత్రి ఏ తొమ్మిదింటికో...

తలుపులు తీస్తే ఒంటరి యిల్లూ శూన్యంలాగా ఆహ్వానించేది. అలసిన శరీరంపైకి పిలవకుండానే నిద్రపిట్టలు వచ్చివాలేవి. తను నిద్రలో వుండగానే సందీప్ ఎప్పుడో వచ్చేవాడు. తలుపులు అన్నీ మూసేసి పక్కన చేరేవాడు.

ముద్దు... ముచ్చట... గాన్ విత్ అలసట

తన కోసం ఎంతలా వెంటపడ్డాడు? ఎంతలా వేధించాడు. తాను కాదంటే ఆత్మహత్య చేసుకోపోయాడు. చివరకు పెద్దవాళ్లను కన్విన్స్ చెయ్యలేక ఇద్దరూ ఒక నిర్ణయం తీసుకుని పెళ్లి చేసుకుని వచ్చేశారు. ఇరువైపులా, అందరికీ దూరమే!

తల విపరీతంగా నొప్పి పెడుతూ వుంటే... సోఫాలోనుండి లేచి వంటింట్లోకి నడిచింది అనూష.

గ్యాస్ వెలిగించి నీళ్లు పడేసి, డబ్బా తీసి చూస్తే పంచదార కన్పించలేదు. 'షిట్' అనుకుంటూ బ్లాక్ టీ తయారు చేసుకుంది. టీ సిప్ చేస్తూ సోఫాలో కూర్చుని టి.వి.ఆన్ చేసింది.

ఇలా రిలాక్సింగ్‌గా, కూర్చుని ఎన్ని రోజులయిందో అనుకుంది.

ఓ తెలుగు ఛానెల్‌లో ఒక చెత్త ప్రోగ్రాం ఏదో...

కాసేపు చూసి మరి చూడలేక ఆఫ్ చేసింది. విసుగ్గా టైము చూసుకుంది రెండయింది. సందీప్ రెండింటికల్లా వస్తాను అన్నాడే! యింకా రాలేదేంటి అనుకుంది లోలోపల.

ధన్వంతరీ ఆచార్య మాటలు గుర్తుకొచ్చి "దాంపత్యం మేడీజీ. డాట్ కామ్" కు లాగిన్ అయింది.

చేతులు జోడించిన నవ్వు మొహం ఒకటి కంప్యూటర్ స్క్రీన్ మీద ప్రత్యక్షం అయింది. "వెల్‌కమ్ టూ! దాంపత్యం మేడీజీ డాట్ కామ్! హేవ్ ఏ నైస్ డే" అన్న అక్షరాలు దానికిందే మెనూ ప్రత్యక్షమయింది. మెనూ క్రింద వరసగా "సీరియస్/ నాన్ సీరియస్" అన్న వాక్యాలు ప్రత్యక్షమయ్యాయి. సీరియస్‌ను క్లిక్ చేసింది. వెంటనే సీరియస్ ఎబౌట్ అంటూ వరుసగా యువర్ హాబీ, యువర్ చిల్డ్రన్, యువర్ వైఫ్, యువర్ నైబర్స్ అన్న అంశాలు ప్రత్యక్షమయ్యాయి. కొంచెం ఆసక్తిగా కనిపించి "యువర్ హాబీ" అన్న విండో ఓపెన్ చేసింది.

"ఎస్ ఆర్ వైడ్ ఓపెన్ బిఫోర్ మ్యారేజి. హాఫ్ షట్ ఆఫ్టర్‌వర్డ్స్"

అన్న కొటేషన్‌తో యువర్ హాబీ స్టార్ట్ అయింది. ఆ వాక్యం చూస్తూనే అనూష నవ్వు ఆపుకోలేకపోయింది.

నిజం! "ఎస్ ఆర్ వైడ్ ఓపెన్ బిఫోర్ మ్యారేజి. హాఫ్ షట్ ఆఫ్టర్ వర్డ్స్" పెళ్ళయ్యాక చాలా విషయాలకి కళ్లు మూసుకోకపోతే సంసారాలు సుఖంగా సాగవు. అలా సిస్టమ్ ముందే సాయంత్రం వరకూ గడిపింది.

అప్పటికి అయిదు అయింది. సందీప్ యింకా రాలేదు.

ఈలోగా ఎఫ్.ఎండ్.హెచ్ నుండి వచ్చిన ప్రతినిధి వీడియో కెమెరా లు అమర్చి వెళ్లిపోయాడు.

ఆరయింది. సందీప్ యింకా రాలేదు.

రెండేళ్ల క్రితం సందీప్ యిలా వుండేవాడు కాదు.

ఆరింటికి వస్తాను అని చెప్తే ఐదు యాభయికల్లా ఖచ్చితంగా వుండేవాడు. అతన్ని చూసి టైము సరిచూసుకునేవాళ్లు.

గలగలమంటూ మాట్లాడేవాడు.

యిప్పుడు మౌనమే మాటయిపోయింది.

తను మాత్రం మౌనంగా యిలా మూడీగా వుండేదా?

ఎప్పుడూ నవ్వుల పువ్వే విచ్చుకునేది. జలపాతపు హోరుతో ఉద్విగ్నంగా వుండేది. ఉద్యమస్ఫూర్తితో వుండేది. మరి యిప్పుడా ఉద్వేగం అంతా ఏమయిపోయింది.

ఆమె ఆలోచనల్లో వుండగానే బయట కారు ఆగిన చప్పుడయింది. లేచి వాకిలివరకూ వెళ్లింది. కారు లాక్ చేసి సందీప్ వస్తున్నాడు.

"యింత లేటయిందేం?" అనూష ప్రశ్న.

బాగా అలసిపోయి వున్న సందీప్ అసహనంగా 'ఊ' లేటయింది అన్నాడు.

"అదే ఎందుకని?" అన్నది.

అనూషవంక చురుగ్గా చూసి వెళ్లిపోయాడు. అతను ఫ్రెష్ అయి వచ్చేసరికి ఆమె బ్లాక్ టీ తీసు కొచ్చింది.

బ్లాక్ టీ వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"సారీ! పంచదార లేదు. చూసుకోలేదు".

"మరి ఏం చేస్తున్నట్టు" అన్నమాట నోటివరకూ వచ్చి ఆగిపోయింది.

"భోజనం బయట చేద్దామా! యింట్లో వంట చెయ్యనా?"

"నీ యిష్టం!"

"అయితే! బయటే చేద్దాం! మనిద్దరం బయటి కెళ్లి చాలా రోజులయింది కదా!"

"సారీ! నాకిప్పుడు ఓపిక లేదు"

అనూషకి కోపం పొంగుకొచ్చింది. ఆ మాత్రం దానికి "నీ యిష్టం" అంటూ బిల్డప్ దేనికి? సరే! వంటే చేస్తాను అంటూ కిచెన్‌లోకి వెళ్లింది.

అనూష వంట చేస్తూ వుంటే సందీప్ ఎఫ్. ఎండ్. హెచ్‌కి లాగిన్ అయ్యాడు. "యువర్ వైఫ్" అన్న విండో ఓపెన్ చేస్తే...

"మంచి ప్రియురాళ్లు తప్పిస్తే మంచి భార్యలు ఎక్కడా ప్రపంచంలో వుండరు. ప్రియురాలు భార్య అవుతుంది కానీ, భార్య ప్రియురాలు కాలేదు. భార్యే ప్రియురాలు కాగలిగితే అతడిపేరు పురుషుడు కాదు. అదృష్టవంతుడు" అన్న మాటలు స్క్రీన్ మీద ప్రత్యక్షం అయ్యాయి.

ఇదివరకు ఎలా వుండేది. నవ్వుల పువ్వులాగా ఎప్పుడూ పరిమళాలు వెదజల్లుతూ వుండేది. చైతన్యం మూర్తీభవించినట్లు వుండేది. ప్రపంచంలోని ఆనందం మొత్తాన్ని రాశిపోసి, ఆ రాశి మొత్తాన్ని తనలో నింపుకున్నట్లుగా వుండేది. ఉత్సాహంగా, తుళ్లిపడుతూ వుండేది. కానీ యిప్పుడు...

నిజ్జంగా నిజం అనుకున్నాడు సందీప్.

బ్రౌజ్ చేస్తూనే చేతికున్న బాండ్ వంక చూశాడు సందీప్. ఈ బాండ్ తన ఆలోచనలని కూడా రికార్డు చెయ్యగలుగుతుందా?

అసలు అనూష ఎందుకు మారిపోయింది.

ఇదివరకు ఎలా వుండేది. నవ్వుల పువ్వులాగా ఎప్పుడూ పరిమళాలు వెదజల్లుతూ వుండేది. చైతన్యం మూర్తీభవించినట్లు వుండేది. ప్రపంచంలోని ఆనందం మొత్తాన్ని రాశిపోసి, ఆ రాశి మొత్తాన్ని తనలో నింపుకున్నట్లుగావుండేది. ఉత్సాహంగా, తుళ్లిపడుతూవుండేది. కానీ యిప్పుడు... సునామీ వచ్చి వెళ్లాక బావురుమంటున్న ఊరులా... హృదయం నిండా శూన్యంతో...

సందీప్ ఆలోచనల్లో వుండగానే అనూష వచ్చి...

"వంటైంది! వడ్డించనా?" అంది.

"ఊఁ" అన్నాడు.

మౌనంగా భోజనాలు ముగించారు. టి.వి.లో రొటీన్ ప్రోగ్రాంలు అన్నీ అయ్యాక మంచానికి చెరోప్రక్క చేరారు. తమ తమ ఆలోచనలతో ఇద్దరూ మౌనంగా వున్నారు.

సందీప్ ఒక పక్కకి ఒత్తిగిల్లి అనూషపై చెయ్యి వేశాడు. అనూష మౌనంగా వుంది. వేసిన చెయ్యిని ఎంజాయ్ చెయ్యనూలేదు. విసిరి కొట్టనూలేదు. ఒక్కక్షణం ఆగాక చెయ్యి తీసి మరోవైపు తిరిగి పడుకున్నాడు.

"ఛీట్!" ఇదివరకు యిలా వుండేదా? తన చెయ్యి పడితే చాలు. ఆమె శరీరం ఎంతో ఫాస్ట్‌గా స్పందించేది. ఆ స్పర్శ రా, రమ్మని స్వాగతం పలికేది! శరీరంలో యిప్పుడేదీ ఆ పిలుపు... యిప్పుడేదీ ఆ స్వాగతం... పాట పాడే ఆ శరీరం యిప్పుడెక్కడ" మౌనంగా కళ్లు మూసుకున్నాడు.

సందీప్ చెయ్యి తీసివెయ్యగానే అతడివైపుకు తిరుగుదామని అను కునీ మానుకుంది. మొక్కుబడిగా చెయ్యివేసి తీసేశాడు. యిదివరకు యిలా కాదు. తనను టెస్టింగా? తమ పెళ్లైన కొత్తరోజులు గుర్తుకొచ్చాయి ఆమెకు. కొంచెం మూడీగా వుంటే చాలు. ఎంతలా యిదయిపోయేవాడు కొంచెం మౌనంగావుంటే చాలు ఎంతలా విలవిల్లాడేవాడు. మాట్లాడిందాకా, నిశ్శబ్దం నదిమీద మాటల వంతెన కట్టేం దాకా వదిలేవాడు కాదు.

యిప్పుడా అనునయింపు ఏది? అప్పటి గారాం యిప్పుడెక్కడ? అప్పటి బ్రతిమిలాటలు, భంగపాటులు, గిల్లికజ్జాలు, చిలిపి పలకరింపులు, ప్రణయ పులకరింపులు యిప్పుడెక్కడ? మొక్కుబడిగా దగ్గరకు తీసుకోవడం తప్పిస్తే, స్పర్శలో అప్పటి ఉద్వేగం ఏది? స్పర్శలో అప్పటి ప్రణయోన్మత్తత ఏది?

అనూష మౌనంగా పడుకుంది. ఎంతకూ నిద్ర కళ్లమీదకు రాలేదు. చీకట్లోకి కళ్లు విప్పార్చుకుని చూస్తూ వుండిపోయింది. ఆమె దృష్టి గోడమీద ఒకచోట ఆగిపోయింది. ఆకుపచ్చగా వెలుగుతూ ఏమిటది? నిన్నటివరకూ లేదే... ఏమిటది?

బహుశా... వీడియో కెమేరా అయివుంటుంది.

అంటే... ఈ బెడ్‌రూమ్... ఇదంతా యిప్పుడు రికార్డుఅవుతోందా?

ఆమె కొంచెం యిబ్బందిగా కదిలింది. ఒక చిన్న ఫీలింగ్... ఎవరో చూస్తున్న ఫీలింగ్... తమదైన అనుభవిక ప్రపంచంలోకి ఎవరో తొంగి చూస్తున్న ఫీలింగ్.

ఆమెకు యింక ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

తెల్లవారురుఝామున ఎప్పుడో సందీప్ ఆమెను తనవైపు తమకంతో లాక్కోబోయాడు. ఆమె అంతే వేగంగా రెసిప్రోకేట్ కాబోయి షాక్ కొట్టినట్లుగా ఆగిపోయింది. ఎదురుగా ఆకుపచ్చని లైటు.

** ** **

వరసాగ్గా రెండు రోజులు సెలవులు వచ్చాయి.

"ఎటయినా వెళ్దామా?" అన్నది అనూష.

"ఊ" అన్నాడు సందీప్.

"ఎటు వెళ్దాం?"

"నువ్వే డిసైడ్ చెయ్యి"

"అరకు వెళ్దామా?"

"రెండు రోజుల్లో అంతదూరం వెళ్లి రాగలమా?"

"పోనీ శ్రీశైలం"

"ఊహూ! అదీ కష్టమే! వెళితే వెంటనే రాలేం"

"పోనీ చిలుకూరు"

"ఏం వుంది అక్కడ. అలౌకిక భక్తి పారవశ్యమూ లేదు. అపురూపమయిన ప్రశాంతతా లేదు. వున్నదల్లా భయమూ, దిగులూ"

"పోనీ నువ్వే చెప్పు"

"కాలేజీ రోజుల్లోకి వెళదాం!"

"ఎలా?"

"ఎలా ఏం వుంది? గమ్యం లేకుండా తిరుగుదాం! ఎక్కడ ఆకలని పిస్తే అక్కడ ఏం కనిపిస్తే అది తిందాం. సగం సినిమా చూద్దాం! ఐస్‌క్రీమూ, పానీపూరీ సగం, సగం కలుపుకుని తిందాం. నగరంలోని రోడ్ల వెడల్పు కొలుద్దాం. అలసట అనిపిస్తే ఏదో ఒక సినిమాహాల్లో దూరదాం! ఎప్పుడు ఏం చెయ్యాలనిపిస్తే అది చేద్దాం! రోజూ డిజైన్ చేసుకున్న చట్రాన్ని బ్రేక్ చేసి, ఎలా వుండాలనిపిస్తే అలా వుందాం!"

అనూష ఆశ్చర్యంతో చూసింది. సందీపేనా యింతలా మాట్లాడింది. ఈ రెండేళ్లలో ఒకటి రెండు పొడిపొడి మాటలు తప్పిస్తే ఇన్ని మాటలు ఒక్కసారి మాట్లాడిందే లేదు. సందీప్ ఉత్సాహం చూస్తే అనూషకీ ఉత్సాహం పొంగుకొచ్చింది.

"ఆ స్కై బ్లూ శారీ కట్టుకుని బయల్దేరనా?"

"వద్దు. ఆ శారీ నీకస్సలు బావుండదు. డ్రస్ వేసుకో!"


"డన్"

యిద్దరూ క్షణంలో బయటపడ్డారు.

కారు వదిలేసి సిటీ బస్సుల్లో తిరిగారు. బిర్లా టెంపుల్‌లో స్వామిని దర్శించుకున్నారు. ఫుడ్‌వరల్డ్‌లో టిఫిన్ చేశారు. టిఫిన్ పాయింట్‌లో భోజనం ఆర్డర్ చేశారు. ఓడియన్‌లో సినిమా చూశారు. సెంట్రల్ లైబ్రరీ హాలులో సాహిత్య సభకు అటెండయ్యారు. రవీంద్రభారతిలో నాట్య ప్రదర్శన చూసినంత పని చేశారు. అలసి, సొలసి రాత్రి పన్నెండు గంటలకు యిల్లు చేరారు.

ఇద్దరికీ ఒంటిమీద వేడినీళ్లు పడగానే కొత్త ఉత్సాహం పొంగుకొచ్చింది. కొత్త ఆనందం చివురులు తొడిగింది. ఇరువురి గుండెలనిండా నేనెక్కడికీ పోలేదంటూ ప్రేమ పొంగిపొరలింది.

గాఢంగా హత్తుకున్నాడు. గువ్వలా అతనిలో ఆమె ఒదిగి పోయింది.



కళ్లెత్తిన ఆమెకు ఎదురుగా ఆకుపచ్చలైటు

జీవితాన్ని యధాతథంగా తీసుకోవాలి. మార్పులు చేర్పులు చేయా లి అనుకుంటే అది జీవితం కాదు. రచయిత ఏర్చికూర్చి రాసిన కథ అవుతుంది. అలాగే ప్రేమ కూడా! పెళ్లికాక ముందే ప్రేమదే మొదటి ప్రియారిటీ! పెళ్లయిన తరువాత సవాలక్ష ఇతర అవసరాలు ప్రియా రిటీల లిస్టులో ప్రేమను వెనక్కు నెడతాయి. అది సహజం కూడా! అంతమాత్రాన 'ప్రేమ' జీవితాల్లోంచి రెక్కలు కట్టుకుని ఎగిరిపోయిం దనుకోవడం తప్పు. భవనానికి పునాదులు ఎక్కడో అడుగున వున్న ట్లుగానే జీవనసౌధానికి కూడా ప్రేమ అనే పునాదులు అట్టడుగునే వుంటాయి. పైపైన కన్పించే తళుకు, బెళుకుల, రంగురంగుల అంతస్తులకి అసలు మూలం పునాదులు అయినట్లుగానే జీవితానికి ప్రేమ కూడా అలాంటిదే! సహజమయిన విషయాలని 'అసహజం' అనుకుని మను షులు నిజంగా ఎందుకు బాధపడ్తారు? జీవితంలో భార్యాభర్తలు పోనీ స్త్రీ పురుషులు ఎదురయిన ప్రతిసారీ "ఐ లవ్ యూ" చెప్పుకోవాల్సిన పనిలేదు. అలా వుంటేనే ప్రేమ వుందనీ కాదు.

ఎంత పనిఒత్తిడిలో వున్నా... యితరేతర వ్యాపకాలలో మునిగి తేలుతున్నా తనకోసం రెండు కళ్లు ఎదురుచూస్తూ వుంటాయన్న ఫీలింగే ప్రేమ. తనకేదయినా అయినా మరుక్షణం ఆ రెండు కళ్లూ వాలిపోతాయన్న అనుభూతి ప్రేమ.

జీవితంలో ప్రేమ వున్నట్లుగానే...కోపం, అసహనం, అసూయ, కొంచెం ద్వేషం, మరికొంచెం ప్రళయం అన్నీ వుంటాయి. అన్నీ వుండటం కూడా ప్రేమే! యివన్నీ వుంటేనే అసలు ప్రేమ విలువ తెలిసేది. ఇవన్నీ సహజం. ఇవన్నీ వుంటాయి కనుకే జీవితం వైవిధ్యభరితంగా వుంటుంది. జీవితంలో వైవిధ్యం లేకపోతే అది జీవితమే కాదు.

భార్యాభర్తలు యిద్దరూ తమలోతాము పేచీపడాలి. గొడవ పడాలి. మళ్లీ కలసిపోవాలి. కలహానంతర కలయిక మధురాతి మధురంకదా!

ఆఫీసునుండి భార్యో, భర్తో ఆలస్యంగా వస్తే ఆ ఆలస్యాన్ని అతని లేదా ఆమె జ్ఞాపకాలతో, తలపులతో ఎంజాయ్ చెయ్యగలగాలి. ఎందుకు ఆలస్యం అయిందో అని తపన పడగలగాలి. ప్రేమించుకున్నప్పుడు ఎదురుచూసినంత తమకంతో ఎదురుచూడగలగాలి. ఎదురుచూస్తున్న వ్యక్తి ప్రత్యక్షమయిన మరుక్షణం ఈ తపనంతా ఎగిరిపోవాలి. దగ్గరకు తీసుకుని సానునయంగా ఒక్క స్పర్శ. అది ప్రేమను నిరంతరం జ్వలింపచేసే ప్రక్రియ.

కారణాలు ఏవయినా కావచ్చు. మనుషులు ఒకరితో మరొకరు కమ్యూనికేట్ కాకపోవడమే అసలయిన ప్రేమ రాహిత్యం. ప్రేమకు కమ్యూనికేషన్ ముఖ్యం. మనసు విప్పి పదినిమిషాలు మాట్లాడుకుంటే గుండెల నిండా పేరుకున్న భారం ఎగిరిపోతుంది. హృదయాలు తేలికవుతాయి. ఈ చిన్న విషయం గుర్తించక జీవితాలు విసిగి వేసారిపోతాయి. అహం ముందుకొచ్చి మరింత ముడుచుకు పోతాయి.

ప్రేమకు బానిసత్వానికి పెద్దగా తేడాలేదు. ఎదుటివాడు చెప్పిన ప్రతిదీ యిష్టంగా చెయ్యడం ప్రేమ. అయిష్టంగా చెయ్యడం బానిసత్వం. అలా అని ప్రేమ బానిసత్వంకానేకాదు. ఈ రెండింటి మధ్యా విభజనరేఖ తెలియక చాలామంది పెళ్లంటే దాస్యం అనుకుంటారు. జీవితం అనే దీపశిఖకి పెళ్లి ప్రమిద అయితే ప్రేమ ఆధారం.

కలిసి చదువుతున్న అనూష సందీప్ ఒకేసారి ఒకరివంక ఒకరు చూసుకున్నారు. యిద్దరి కళ్లల్లో సన్నగా కన్నీళ్లు. ఆమె భుజం చుట్టూ చెయ్యి వేసి దగ్గరగా తీసుకున్నాడు. అతడి నడుమును ఆమె చేయి చుట్టింది. తాము చేస్తున్న తప్పేమిటో యిద్దరికీ అర్థమయింది. నిజంగా తమకి కౌన్సెలింగ్ అవసరమా? తమ జీవితాలలో ఏర్పడిన శూన్యాన్ని, వెలితినీ, మూడోమనిషి పారద్రోలగలుగుతాడా? తమ బెడ్‌రూంలోకి, యితరేతర స్థానాలలోకి వీడియో కెమేరాలు/ దాంపత్యం మేడీజీ డాట్ కామ్‌లు అవసరమా?

ఇద్దరూ కలిసి బెడ్‌రూంలో వెలుగుతున్న ఆకుపచ్చ లైటుని తీసి డస్ట్‌బిన్‌లో పడేసారు. వీడియో కెమేరాను అవతల పడేసారు. అతనిలో ఆమె గువ్వలా ఒదిగిపోయింది. ఇప్పుడు ఎవరో చూస్తున్నారన్న ఫీలింగే లేనేలేదు.

ఒకరి హృదయంలో మరొకరు ఒకేసారి గుసగుసగా యిలా చెప్పారు.

"ఐ లవ్ యూ!"

•



# చైనాలో కోడిగుడ్డు పండగ

వసంతం ఆరంభమవుతుంటే చైనాలో కోడిగుడ్ల ఉత్సవం జరుగుతుంది. వసంతం తొలిరోజు కోడిగుడ్డు నిలబడుతుందని వస్తున్న ఆచారం కూడా. నేలపైగాని, నున్నగా వున్న ఏ ప్రదేశంపైన అయినా సరే, కోడిగుడ్డును ఆరోజు సులభంగా నిలపవచ్చు అని ఇందలి సారాంశం. ఈ నమ్మకంపై చైనాలో చాలా కథలు గాథలు ఉన్నాయి.

వసంతం తొలినాడే ఎందుకు సులభంగా కోడిగుడ్డు నిలుస్తుంది. అంటే సూర్యుడు, గ్రహాలు ఆనాడు కోడిగుడ్డుపై గురుత్వాకర్షణశక్తి ప్రభావం కనబరుస్తాయన్నారు. ఆ నమ్మకంతో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసంలో కోడిగుడ్ల ఉత్సవం జరుపుకుంటున్నారు.

వసంతం మొదటిరోజును చైనాలో లిచున్ అంటారు. సాధారణంగా ఇది ఫిబ్రవరిలో వస్తుంది. ఆనాడు చైనాలో ఎక్కడ బడితే అక్కడ జనం కోడిగుడ్లను బల్లలపైన, నేలపైన, కాలిబాటపైన చివరకు ఇనుపకడ్డీలపైనా నిలుపుతారు.

చైనా నమ్మకం క్రమంగా అమెరికాకు సైతం పాకింది. అయితే సాధారణంగా అమెరికాలో వసంతం మార్చిలో వస్తుంది. అయినా నమ్మకం పాటిస్తున్నారు.

అమెరికాలోని న్యూయార్క్‌లో వరల్డ్‌ట్రేడ్ సెంటర్‌వద్ద ఏటా కోడిగుడ్డు నిలిపే క్రతువు జరిగేది. ఇప్పుడు ఆ సెంటర్ కాస్తా అదృశ్యమైంది.

కోడిగుడ్డు ఏ కాలంలోనైనా కొంత నునుపు, కొంత గరుకుగా ఉన్నచోట్ల నిలపవచ్చు. కొద్దిగా అభ్యాసం చేస్తే ఇది సాధ్యమే. గురుత్వాకర్షణశక్తి కోడిగుడ్డుపై చూపుతుందనేది కేవలం సైన్స్ బొత్తిగా తెలియనిమాట. చిన్న వస్తువులపై గ్రహాలు, సూర్యుడి ఆకర్షణశక్తి ఉండదు.

నేలమీదగాని, బల్లపైగాని కొద్దిగా ఉప్పురాసి, అక్కడ కోడిగుడ్డు పెడితే నిలుస్తుంది. ఉప్పు కనిపించకుండా మెల్లగా ఊదేయవచ్చు కూడా.

1565లో క్రిస్టోఫర్ కొలంబస్ కోడిగుడ్డు నిలబెట్టి అందర్నీ ఆశ్చర్యపరచాడంటారు.

తైవాన్‌లో కూడా కోడిగుడ్డు నిలిపే ఉత్సవం ఏటా జరుగుతుంది. సర్వసాధారణంగా మెజీషియన్లు గుడ్డు నిలిపి, ఆశ్చర్యపరుస్తుంటారు. ఇంతకూ ఇది నమ్మకంతో వస్తున్న ఆచారం మాత్రమే.

– ఎన్.ఇన్నయ్య